బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌ను చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య శుక్రవారం నగరంలోని కేసీఆర్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

గ్రూప్-1 పరీక్ష నిర్వహణపై జాగ్రత్తలు తీసుకోండి

వికారాబాద్ కలెక్టర్ నారాయణ రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, మే 31 : గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష సజావుగా జరిగేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం జూన్ 9న నిర్వహించే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధి విధానాలపై కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో చీఫ్ సూపరింటెండెంట్‌లు, శాఖపరమైన జిల్లా అధికారులు, రూట్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణలో ఎలాంటి తప్పిదాలు లేకుండా చూడాలన్నారు. జిల్లాలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను 13 కేంద్రాల్లో జరుగుతుండగా, 5,468 మంది అభ్యర్థులు హాజరు అవుతున్నట్లు తెలిపారు. వికారాబాద్‌లో 7, తాండూరులో 4, పరిగిలో 2 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు అన్ని మౌలిక వసతులతో పాటు ఫర్నిచర్, తాగునీరు, నిరంతర విద్యుత్తు, ఫ్యాన్‌లు, టాయిలెట్ల వంటి సౌకర్యాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో అత్యవసరమైన మందులతో పాటు వైద్య సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

పరీక్షా కేంద్రాల్లో మొబైల్, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించకూడదని అధికారులను ఆదేశించారు. టీఎస్ పీఎస్సీమార్గదర్శకాలకు అనుగుణంగా పరీక్ష నిర్వహించాలన్నారు. పరీక్షా పత్రాలను స్ట్రాంగ్ రూమ్ నుంచి పూర్తి పోలీస్ బందోబస్తు మధ్య, ప్రోటోకాల్ ప్రకారం పరీక్షా కేంద్రాలకు తీసుకురావాలన్నారు. గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షల్లో విధులు నిర్వహించే సిబ్బందికి పూర్తిస్థాయి శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల్లో అనధికార వ్యక్తులు లేకుండా పకడ్బందీ జాగ్రత్తలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, గ్రూప్-1 రీజినల్ కోఆర్డినేటర్ డా.రాజేశ్, కలెక్టరేట్ పరిపాలన అధికారి అమరేందర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల భూములను రక్షిస్తాం

ఎండోమెంట్ ఈవో ప్రవీణ్ కుమార్

కందనెల్లి గ్రామంలో అభయాంజనేయ ఆలయ భూమి హద్దులను పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎండోమెంట్ ఈవో ప్రవీణ్ కుమార్

పెద్దేముల్, మే 31 : గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వివిధ ఆలయాల భూములు కబ్జాకు గురికాకుండా రక్షిస్తామని ఎండోమెంట్ ఈవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కందనెల్లి గ్రామంలోని అభయాంజనేయ స్వామి ఆలయ భూమి, దేవాలయాన్ని గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండోమెంట్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని ఆలయాలను సందర్శించి, ఆలయ భూముల రక్షణ, ఆలయాల్లో ధూపదీప నైవేద్యం, ఆలయాల పరిశుభ్రతలను పరిశీలిస్తున్నామన్నారు. కందనెల్లి అభయాంజనేయ ఆలయ భూమిని పరిశీలించి ఆలయ భూమి రికార్డుల ప్రకారం విస్తీర్ణం ఉన్నదా లేదా రక్షణ చర్యలు ఏమి తీసుకొంటున్నారని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. గుడి భూమిని పరిశీలించి సర్వే చేసి హద్దులు పాతడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఇదే తరహాలో అన్ని ఆలయాల భూములను సర్వే చేయించి హద్దులు పాతి రక్షణ కంచెలను ఏర్పాటు చేయించుకోవాలని సూచించారు. ఆయన వెంట ఆలయ కమిటీ చైర్మన్ గాండ్ల శివకుమార్, పూజారి తమ్మలి శ్రీనివాస్, రాజేశ్వర్ స్వామి, హన్మంత్‌రెడ్డి, జంగం బుడ్డయ్య స్వామి తదితరులు ఉన్నారు.

సరస్వతీతల్లి ఆలయాన్ని నిర్మించడం అభినందనీయం

- విద్యావేత్త చుక్కా రామయ్య



ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్యని సన్మానిస్తున్న కోర్పోలు లీలమ్మ

కడ్తాల్, మే 31 : చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించేందుకు ఈ ప్రాంతంలో జ్ఞాన సరస్వతీతల్లి ఆలయాన్ని నిర్మించడం అభినందనీయమని ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య అన్నారు. మండల పరిధిలోని రామేశ్వర వీరాంజనేయస్వామి క్షేత్రం ఆవరణలోని, జ్ఞాన సరస్వతీతల్లి ఆలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పది మంది చిన్నారులకు ఆయన అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో ఏదైనా సాధించవచ్చని తెలిపారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదువాలని పేర్కొన్నారు. జ్ఞానసరస్వతీతల్లి ఆలయాన్ని నిర్మించిన కోర్పోలు లీలమ్మ, లక్ష్మారెడ్డి దంపతులను ఆయన అభినందించారు. అనంతరం చుక్కా రామయ్యను ఆలయ నిర్వాహకులు, విద్యావంతులు శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వందే మాతరం రవీందర్‌రావు, మాజీ సర్పంచ్ పోతుగంటి శంకర్, ప్రముఖ రచయిత్రి జ్ఞానప్రసూనాశర్మ, శ్రీరాములు, పర్వతాలు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గడ్డమల్లయ్యగూడలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న కేంద్ర బృందం ప్రతినిధులు

చింతపట్లలో పల్లె పకృతి వనాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం అధికారులు

పల్లె ప్రగతి పనులు భేష్

కేంద్ర బృందం కితాబు..యాచారంలో పర్యటన

యాచారం, మే 31 : గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించిన పల్లె ప్రగతి పనులు భేషుగ్గా ఉన్నాయని కేంద్ర బృదం ప్రతినిధులు కితాబిచ్చారు. శుక్రవారం మండలంలోని గడ్డమల్లయ్యగూడ, చింతపట్ల, నజ్దిక్ సింగారం గ్రామాల్లో కేంద్ర గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వ శాఖ అధికారులు ఎంపీడీవో నరేందర్‌రెడ్డి సమక్షంలో మండల, జిల్లా అధికారులతో కలిసి పర్యటించారు. ఆయా గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన ల్యాండ్ లెవలింగ్ పనులను స్వయంగా పరిశీలించారు. నర్సరీలలో పెంచుతున్న మొక్కలు, పల్లె పకృతి వనాల్లో ఏపుగా పెరిగిన మొక్కలు, చింతపట్లలో రోడ్లకు ఇరువైపులా ఆహ్లాదకరంగా ఉన్న హరితహారం చెట్లను చూసి ఆనందం వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల్లో విద్యార్థులు, యువకుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలను పరిశీలించారు. గడ్డమల్లయ్యగూడలో ఎన్ఆర్ఈజీఎస్ సహకారంతో ఏర్పాటు చేసిన ఆవుల షెడ్లు, జామతోటలను చూసి అభినందించారు. చింతపట్లలో ఈజీఎస్ నిధులతో వేసిన సీసీ రోడ్లు, అమృత్‌సరోవర్ ప్రాంతాన్ని స్థానికులతో కలిసి పరిశీలించారు. నజ్దిక్‌సింగారంలో గ్రామ పంచాయతీ రికార్డులను వారు స్వయంగా పరిశీలించారు. గ్రామాల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనుల వివరాలపై ఆరా తీశారు. చేతినిండా పని ఉన్నదా.. సకాలంలో డబ్బులు వస్తున్నాయా.. అంటూ కూలీలను అడిగి తెలుసుకున్నారు. ఆవుల షెడ్డు, జామతోటలు పెంచుతున్న రైతులతో మాట్లాడారు. దిగుబడి, లాభాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో పల్లె ప్రగతి పథకం కింద చేపట్టిన నర్సరీలు, పల్లె పకృతి వనాలు, హరితహారం మొక్కలు, క్రీడా ప్రాంగణాలు బేషుగ్గా ఉన్నాయని కితాబునిచ్చారు. పచ్చదనాన్ని పెంపొందించడానికి, పర్యావరణాన్ని పరిరక్షించడానికి చేపట్టిన నర్సరీలు, పల్లె పకృతి వనాలు, హరితహారం పనులను పక్కాగా అమలు చేయడం అభినందనీయమన్నారు. ఉపాధి హామీ పనుల్లో ఎలాంటి అవకతవకలు లేకుండా పకడ్బందీగా నిర్వహిస్తూ రైతుల పొలాలను అభివృద్ధి చేయడం బాగున్నదన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు పని కల్పించడం సంతోషకరమన్నారు. ఉపాధి హామీ నిధులతో ఆవుల షెడ్లు, తోటల పెంపకంతో రైతులకు అండగా ఉండడం బాగున్నదన్నారు. సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, నీటి ట్యాంకుల నిర్మాణాలతో గ్రామాలను అభివృద్ధి చేయడం తమకెంతో నచ్చిందన్నారు. చింతపట్లలో పల్లె పకృతి వనం ఆకర్శనీయంగా ఉన్నదన్నారు. మండలంలో పర్యటన విజయవంతంగా ముగిసినందున సంతోషంగా ఉన్నదని స్పష్టం చేశారు. ఇక్కడి అభివృద్ధి పనులపై ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు. మండలంలో పర్యటించిన కేంద్ర గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వ శాఖ పోగ్రాం ఆఫీసర్లు అరవింద్రకుమార్, కిరణ్ చరణ్ పాడీ, కిరణ్ పి మలి, హన్సల్ సుధర్, పంకజ్‌రాణా, సీనియర్ డెవలపర్స్ అమిత్ కుమార్, శివరామ్ లోహనీలతో పాటు రాష్ట్ర ఈజీఎస్ జాయింట్ కమిషనర్ నర్సింహులు, ఎస్పీ ఎంలు మల్లేశ్వర్‌రావు, మురళీధర్, కృష్ణమూర్తి, అబేద్ ఖాన్, రఘువీర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారిణి శ్రీలత, అడిషనల్ డీఆర్‌డీవో సుభాషిణి, ఇబ్రహీంపట్నం అడిషనల్ పీడీ సక్రియానాయక్, చేవెళ్ల ఏపీడీ చరణ్, యాచారం ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, తహసీల్దార్ అయ్యప్ప, వ్యవసాయాధికారి సందీప్, ఎంపీవో ఉమారాణి, ఏపీవో లింగయ్య, ఈసీ శివశంకర్‌రెడ్డి, ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి కూలీలు ఉన్నారు.

ప్రజల చేతికి.. హోటల్స్ రేటింగ్

రెస్టారెంట్ల యాజమాన్యాలకు జవాబుదారితనం పెరగాలి

పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు కమిటీ

ఇటీవల తనిఖీల్లో సమస్యలు గుర్తింపు

హైదరాబాద్ రెస్టారెంట్స్‌కు రేటింగ్ ఇవ్వాలని నిర్ణయం

ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసిన ఎన్ఆర్ఏఐ

సిటీబ్యూరో, మే 31 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ మహానగరంలో ఉన్న రెస్టారెంట్స్‌కు పరిశుభ్రతలో రేటింగ్స్ ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నారు. నగరంలో ఇటీవల కాలంలో పలు రెస్టారెంట్లపై నిర్వహించిన దాడుల నేపథ్యంలో నేషనల్ రెస్టారెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ఆర్ఏఐ)ఈ నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లోని రెస్టారెంట్లకు హైజీన్ రేటింగ్స్ ఇవ్వాలని, తద్వారా జవాబుదారితనం పెంచడానికి ఈ చొరవ దోహదం చేస్తుందని ఎన్ఆర్ఏఐ ప్రతినిధి తెలిపారు. ఎన్ఆర్ఏఐ హైదరాబాద్ చాప్టర్ హెడ్ సంపత్ తుమ్మల అధ్యక్షతన 15 మంది సభ్యులతో కూడిన ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. ఇది నగరం అంతటా ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్స్ అథారిటీ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ప్రమాణాల అమలును నిర్ధారిస్తుంది. హోటళ్లు, రెస్టారెంట్లలో పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు త్వరలో ఒక కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చాప్టర్ ప్రతినిధి తెలిపారు. ఎన్ఆర్ఏఐ టాస్క్‌ఫోర్స్ బృందం వర్క్‌షాపులు, శిక్షణ కార్యక్రమాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి పరిశుభ్రతపై నిర్వాహకులకు అవగాహన కల్పిస్తుంది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆహార భద్రతా విభాగం టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీల సమయంలో వివిధ రెస్టారెంట్లలో పరిశుభ్రత విషయంలో చాలా సమస్యలను గుర్తించిన నేపథ్యంలోనే ఈ కార్యక్రమాలను ఎన్ఆర్ఏఐ చేపట్టిందని తెలిపారు.

సాధారణ ప్రసవాలపై దృష్టి సారించాలి

తాండూరు, మే 31 : సాధారణ ప్రసవాలపై దృష్టి సారించాలని ఎంసీహెచ్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సాయిబాబా అన్నారు. శుక్రవారం తాండూరు పట్టణంలోని శ్రీ శివ నర్సింగ్ హోమ్‌ను డిప్యూటీ మాస్ మీడియా అధికారి శ్రీనివాసులుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించి మాట్లాడారు. సాధారణ ప్రసవాల కంటే సిజేరియన్ ప్రసవాలు అధికంగా జరుగుతున్నాయన్నారు. సిజేరియన్ ప్రసవాలు చేయడానికి గల కారణాలను కేస్ షీట్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని ఇప్పటికే సూచించామన్నారు. అనవసరంగా సిజేరియన్ ప్రసవాలు చేస్తూ నిబంధనలను ఉల్లగించినట్లు తమ దృష్టికి వస్తే గైనకాలజిస్టులతో పాటు దవాఖానలపై క్లీనికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ 2010 ప్రకారం కఠిన చర్యలను తీసుకోవడం జరుగుతుందన్నారు.

తాండూరు పట్టణంలో ఓ నర్సింగ్ హోమ్‌ను తనిఖీ చేస్తున్న ఎంసీహెచ్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సాయిబాబా

పనుల్లోకి జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్లు

సిటీబ్యూరో, మే 31, (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ, కాంట్రాక్టర్ల మధ్య నెలకొన్న వివాదం ఎట్టకేలకు ముగిసింది. పెండింగ్ పనులు చెల్లించే వరకు పనులు చేపట్టబోమని జీహెచ్ఎంసీకి అల్టిమేటం జారీ చేసిన కాంట్రాక్టర్ల అసోసియేషన్ మే 18వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్లారు. జీహెచ్ఎంసీ ఆరు జోన్ల పరిధిలో మొత్తం కాంట్రాక్టర్లు పనులను ఎక్కడికక్కడ నిలిపివేసి బంద్ పాటించారు. కమిషనర్ సైతం వారిని చర్చల్లోకి పిలవకపోవడంతో అత్యవసర పనులను నిలిపివేస్తామని, మాన్‌సూన్ పనుల టెండర్లలో పాల్గొనబోమని హెచ్చరించారు.

గిరిజన రిజర్వేషన్లు తగ్గిస్తే ఊరుకోం

ఖైరతాబాద్, మే 31 : రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన గిరిజనుల రిజర్వేషన్లను తగ్గిస్తే ఊరుకునేది లేదని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు ఇస్లావత్ రాంచందర్ నాయక్ అన్నారు. ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్‌లోని గిరిజన విద్యుత్ భవన్‌లో జరిగిన ఆ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశంలో రాంచందర్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో జీవో నం.33 ప్రకారం గిరిజన జనాభా ప్రాతిపదికన విద్యా, ఉద్యోగాల్లో పది శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయని తెలిపారు. కొందరు పది శాతం రిజర్వేషన్లను విచ్ఛిన్నం చేయడానికి కుట్రలు చేస్తున్నారని చెప్పారు. రిజర్వేషన్లు తగ్గించాలని చూస్తే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం అసోసియేట్ అధ్యక్షుడు ఆర్.మోహన్ సింగ్, ప్రధాన కార్యదర్శి నారాయణ నాయక్, ఉపాధ్యక్షులు శివాజీ రాథోడ్, తేజావత్ జోగారాం, గోపీచంద్, కిషన్ నాయక్, ధనుంజయ, ప్రవీణ్ నాయక్, హరిసింగ్, విష్ణు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాంచందర్ నాయక్

ప్రతి ఉద్యోగి నిబద్ధత, అంకిత భావంతో పనిచేస్తే మనసుకు సంతృప్తి

వికారాబాద్, మే 31 : ప్రతి ఉద్యోగి నిబద్ధత, అంకిత భావంతో పని చేస్తే మనసుకు సంతృప్తి కలుగుతుందని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పదవీ విరమణ పొందిన జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్‌న పీ అనిల్‌కుమార్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి డీ సుధారాణిలకు జిల్లా యంత్రాంగం, వివిధ శాఖల అధికారులు ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగ సర్వీస్‌లో అధికారులు నిజాయితీ, పారదర్శకతతో పని చేయాలన్నారు. అనంతరం జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ పీ అనిల్ కుమార్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి డీ సుధారాణిలకు కలెక్టర్, అదనపు కలెక్టర్, జిల్లా యంత్రాంగం, వివిధ శాఖల అధికారులు జ్ఞాపికలు, పుష్ప గుచ్ఛాలు అందజేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఎస్సీ డీడబ్ల్యూవో మల్లేశం, పంచాయతీరాజ్ ఈఈ ఉమేశ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మొజెస్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్, డీవైఎస్‌వో హన్మంత్ రావు, డీబీసీ డబ్ల్యూవో ఉపేందర్, జిల్లా ఆడిట్ అధికారి వీరభద్ర, డీడబ్ల్యూవో జ్యోతి పద్మ, జిల్లా మత్స్య శాఖ అధికారి చరితా రెడ్డి, జిల్లా పౌర సంబంధాల అధికారి చెన్నమ్మ, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సురేశ్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘన సత్కారం

ఏవీ సూపర్‌వైజర్ నర్సింహులును సన్మానిస్తున్న డీపీఆర్‌వో పద్మశ్రీ, ఇతర సిబ్బంది

రంగారెడ్డి, మే 31 (నమస్తే తెలంగాణ) : జిల్లా పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో ఏవీ సూపర్‌వైజర్‌గా పని చేసి పదవీ విరమణ పొందిన ఎ.నర్సింహులును డీపీఆర్‌వో పద్మశ్రీ, ఇతర సిబ్బంది శుక్రవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అడిషనల్ పీఆర్‌వో బాలేశ్వరి, ఏపీఆర్‌వో మధు , ఏవీ సూపర్‌వైజర్ ప్రసాద్, టైపిస్టులు దయానంద్, అజీజ్, రికార్డు అసిస్టెంట్ సురేశ్‌గౌడ్, డ్రైవర్ ఈశ్వర్, ఫొటోగ్రాఫర్ ప్రవీణ్‌కుమార్, నాల్గవ తరగతి సిబ్బంది ఫకీర్ చంద్, అనిత, హబీబా బేగం, షేక్ లియాకత్ అలీ తదితరులు పాల్గొన్నారు.



సిటీబ్యూరో: నగరంలో కన్హాశాంతివనంలో జరిగిన గ్లోబల్ స్పిరిచువల్ కాన్ఫరెన్స్ విజయవంతం కావడంతో మరింత గొప్పగా విశ్వవ్యాప్తంగా యోగా ప్రాధాన్యతను వివరించేందుకు శ్రీరామచంద్ర మిషన్ ప్రెసిడెంట్, ద గైడ్ ఆఫ్ హార్ట్‌ఫుల్నెస్ దాజి శుక్రవారం యోగాపై యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో ఉపన్యసించారు.